



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com




సంపుటి : 19 సంచిక : 73 | 27-05-2026 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00




2

## శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు.



2

## శివరాజ్ సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు.



## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

### సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం

### సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క

మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు.

2

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన




### నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం

### తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ

కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.



2

## జనసేనాని పవన్‌పై వ్యాఖ్యలు

### ప్రొపెసర్ నాగేశ్వర రావు అరెస్ట్‌కు రంగం సిద్ధం

### డిజిపి ఆనందంను కలిసి రక్షణ కల్పించాలన్న నాగేశ్వర్

హైదరాబాద్,

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ పోలీసులు అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఆంధ్రా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో నాగేశ్వర్ రావు ఇంటి వద్ద తెలంగాణ పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలో నాగేశ్వర్ రావు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. తనకు భద్రత కల్పించాలని డీజీపీని కోరారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో అరెస్ట్ చేయాలంటే ఇక్కడి పోలీసుల అనుమతి ఉండాలని, లేకపోతే అది అక్రమ అరెస్టుగా పరిగణించాల్సి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అరెస్టుకు అనుమతి ఇస్తారా లేక అరెస్టును అడ్డుకుంటారా అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ అరెస్ట్ చేసేందుకు వస్తే హైకోర్టులో అరెస్ట్ కాన్సిల్ చేసేందుకు రిట్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు ఉన్నట్లు సమాచారం.

## గవర్నర్‌ను కలిసిన టిఆర్ఎస్ అధినేత కవిత

### వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని వినతి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరినట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తెలిపారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వెలుగుమట్లతో



పాటు వికారాబాద్ జిల్లా కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి గవర్నర్‌ను కలిశామని చెప్పారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు తదితర సమస్యలపై బాధితులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. న్యాయం జరగకపోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత చెప్పారు.



2

## మరోమారు పెరోల్‌పై బయటకు డేరాబాబా

అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ అలియాస్ డేరా బాబా మరోసారి 30 రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. హరియాణాలోని సునారియా జైలు నుంచి మంగళవారం బయటకు వచ్చారు.

3



## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# తెలంగాణలో అవినీతి రాజ్యం



### అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

### శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్

### సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం

### కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

2 లో..

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷–గ్గ÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్‌ఎంసి విభజన

## నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ





హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

## సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం

## సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క

హైదరాబాద్,

మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# శివరాజ్ సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

## ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవేగౌడ

## వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి











కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రైతు కుటుంబం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చారు. 17 ఏళ్ల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రముఖ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ పేరు తెచ్చుకున్నారు. ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం. రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలి. మోదీ అంటే 'మేకింగ్ ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు టీడీపీ ఎంపీలు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు.

# మరోమారు పెరోల్‌పై బయటకు డేరాబాబా

## 9 ఏళ్లలో 16 సార్లు పెరోల్ పొందిన గుర్మీత్

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ అలియాస్ డేరా బాబా మరోసారి 30 రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. హరియాణాలోని సునారియా జైలు నుంచి మంగళవారం బయటకు వచ్చారు. 2017లో శిక్ష పడిన తర్వాత ఆయనకు 16వసారి పెరోల్ లభించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తన శిష్యురాళ్లు ఇద్దరిపై అత్యాచారానికి ఒడిగట్టిన నేరానికి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ మరోసారి పెరోల్‌పై విడుదలయ్యారు. 2017లో అతడికి శిక్ష పడిన నాటినుంచి పెరోల్‌పై తాత్కాలికంగా విడుదలవడం ఇది 16వ సారి. శిక్ష అనుభవిస్తున్న గత 9 ఏళ్లలో 400 రోజులకు పైగా అతడు జైలు బయటే గడిపాడు. ప్రస్తుత పెరోల్ కాలంలో డేరా బాబా సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలోనే ఉంటారని న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 2002లో ఒక జర్నలిస్టు హత్య కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు డేరా బాబాకు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా.. ఏడేళ్ల జైలు జీవితం తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. ఆ తర్వాత, తన శిష్యురాళ్లపై లైంగిక వేధింపుల కేసులో 2017లో గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. నాటినుంచి జైల్లోనే ఉంటున్నాడు. 2020 నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 16 సార్లు పెరోల్‌పై విడుదలై.. రోజులతరబడి బయటే తిరుగుతున్నారు. ఇప్పటికి గుర్మీత్ శిక్ష ప్రారంభమై 9 ఏళ్లు అవుతోంది. ఈ 9 ఏళ్ల కాలంలో ఆయన 400 రోజులకు పైగా జైలు బయటే గడిపారు. ప్రస్తుత పెరోల్ కాలంలో గుర్మీత్.. సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కేంద్రంలో ఉండనున్నారు. అధికారులు కఠిన నిఘా మధ్య ఆయనను అక్కడికి తరలించినట్లు సమాచారం. గతంలో ఎన్నికల సమయాల్లో కూడా రామ్ రహీమ్‌కు పెరోల్ మంజూరు కావడం వివాదాస్పదమైంది. ప్రతిపక్ష పార్టీలు దీనిపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. రామ్ రహీమ్ విడుదలయ్యే ప్రతిసారీ ఆయన అనుచరులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈసారి కూడా హరియాణా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

# ఎంజిబిఎస్‌లో బస్సులో మంటలు

హైదరాబాద్,

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గద్వాల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మహబూబ్‌నగర్, గద్వాల వైపు వెళ్లే బస్సులు ఆగే ప్రాంతంలోని ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భయంతో బస్సు దిగి ప్రయాణికులు పరుగులు తీశారు. అనంతరం ప్రయాణికులు బస్సు దిగి మంటలార్పే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న ఆర్టీసీ సిబ్బంది మంటలు వ్యాపించకుండా నీళ్లతో ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

# తెలంగాణలో అవినీతి రాజ్యం

## అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

## శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్

## సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం

## కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూముల ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమా లు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

## తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే

## పోలీసులకు లొంగిన నరహరి,ధనమ్మ జంటకు చెక్కులు అందచేత

## గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి

## డిజిపి సివి ఆనంద్ పిలుపు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందుతులు అరెస్టు



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మంగళవారం టేకులపల్లి వంతెన వద్ద ఎస్సై వి. రమేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీల్లో చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించగా గత కొంతకాలం నుండి ఖమ్మంలో రెండు మోటార్ సైకిల్, రెండు ఆటోలు దొంగిలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా 3,30,000 ఉంటుందని తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్ లో సిపిఐ ఆఫీస్ వద్ద ఒక మోటార్ సైకిల్ ను రెండవది ఖమ్మం బాలాజీ నగర్ లో లిటిల్ స్టార్ హాస్పిటల్ వద్ద ఒక ఆటోను, మూడోది ఖమ్మం బ్రాహ్మణ బజార్లో ఒక ఇంటి ముందు ఉన్న పల్సర్ మోటార్ సైకిల్ ను, మరియు ఖమ్మం నెహ్రూ నగర్ లో వీచీ= హాస్పిటల్ ముందు ఆగి ఉన్న ఒక ఆటోను దొంగిలించినావని నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. నిందితులు ఖమ్మం పెద్ద తండాకు చెందిన ఆటో డ్రైవర్లైన నునావత్ సాయికుమార్, బానోత్ సాయికుమార్, వియం బంజరకు చెందిన రేపల్లి శ్రీను ఏరాజు ఇతని పై గతంలో కూడా ఖమ్మం ఒకటవ టౌన్ పరిధిలో రెండు దొంగతనాలు చేశాడని తెలిసిందన్నారు. రెండు ఆటోలు, రెండు మోటార్ సైకిల్ ను స్వాధీనపరచుకొని వారిని అరెస్టు చేసి కోర్టు నందు హాజరు పరిచినట్లు తెలిపారు.

# బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించిన పోలీస్ కమిషనర్

## పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ శిక్షణతో రాణిస్తున్న పోలీస్ పిల్లలు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 23,24 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్ -11,13 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ -2026 సింగిల్స్, డబుల్స్ పోటీలలో ప్రతిభ చూపి 12వ యోనెక్స్- సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర సీనియర్, జూనియర్ సబ్-జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్లకు అర్హత సాధించిన క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఇటీవల రాష్ట్ర డీజీపీ నూతనంగా ప్రారంభించిన పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ లో



బ్యాడ్మింటన్ శిక్షణ పొందిన పోలీస్ సిబ్బంది పిల్లలుఇస్లావత్ కీర్తిష్, వి.నిశాంత్,ఎ.శ్రీ మేధాన్షా,ఎం.మనోజ్,ఎ.రోహిత్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ లో ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించి క్రీడల్లో రాణిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ కంప్లెక్స్ ను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

# హెచ్ పి వి, వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి. .. సర్పంచ్. పూనెం.కృష్ణ దొర,

అక్షర కలం./ భద్రాచలం

పద్నాలుగు సంవత్సరాలు దాటిన బాలికలు తప్పనిసరిగా హెచ్ పి వి వ్యాక్సిన్.తీసుకోవడంవలనభవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చునని అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లలకు యుక్త వయసు వచ్చినప్పుడే వివాహాలు చేయాలనిభద్రాచలంసర్పంచ్.పూనేం.కృష్ణఅన్నారు.మంగళవార ందుమ్మగూడెం ప్రాజెక్ట్ పరిధిలోని భద్రాచలం సెక్టార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికమహిళావారోత్సవాల సందర్భంగాభద్రాచలంగ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిడిపిఓ జ్యోతితో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ ఐసిడిఎస్ఆధ్వర్యంలోపనిచేయుచున్న అంగన్వాడి కార్యకర్తలు మరియు ఆయాలు చిన్నారులకు రక్తహీనత కలగకుండా న్యూట్రిషన్ ఫుడ్ సక్రమంగా అందించాలని,గర్భిణీ స్త్రీలకుసమయానుకూలంగాబాలామృతం అందజేసి పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యంగాఉండేలాగర్భిణీలు పలు జాగ్రత్తలు తీసుకునేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే



పోషకాహార ప్రాముఖ్యత గురించి తప్పనిసరిగా గ్రామాలలో తెలియజేయాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకునేలా చూడాలని అన్నారు.అనంతరం సిడిపిఓ జ్యోతి, మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఎక్కువ శాతం బాల్య వివాహాలు చేస్తూఉంటారనివాటినినిరోధించడానికి మా ప్రాజెక్టు తరుపున ప్రత్యేక చర్యలుతీసుకుంటున్నామని,యువతికి పద్దెనిమిది సంవత్సరాలు, యువకుడికిఇరవైఒక్కసంవత్సరాలు నిండితేనే వివాహాలు జరిపించాలని, మైనార్టీ తీరకముందు వివాహాలు జరిపిస్తే వివాహాలు జరిపిన వారికి పెళ్లి చేసిన పురోహితులకు మరియు ఆ గ్రామ పెద్దలకు తల్లిదండ్రులకు ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని,గ్రామంలోని యువజన కార్యకర్తలు గ్రామములో ఎక్కడైనాబాల్యవివాహాలుజరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే తప్పనిసరిగా ఐసిడిఎస్.కార్యాలయమునకుసంప్రదించి తెలియజేయాలని అలా రాని పక్షంలో 1098 నెంబర్కు ఫోన్ ద్వారా తెలియజేస్తే తప్పనిసరిగా వారిపై చర్యలు తీసుకుంటారని అన్నారు. అలాగే గ్రామంలోని యూత్ సంబంధించిన యువకులు మానవ అక్రమరవాణాజరగకుండాఎప్పటికప్పుడు నీగా పెడుతూ ఉండాలని అన్నారు.అనంతరంఈకార్యక్రమానికి వచ్చినబాలికలుఅందరిచేతప్రతిజ్ఞ చేయించారు.ఈకార్యక్రమంలోగ్రామపంచాయతీ ఈవో.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ,మరియు బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించండి.----. సిపిఎం మండలపార్టీ.

అక్షర కలం / ఇల్లెందు.

ఇల్లందు మండలంలోని సీఎస్పీ గ్రామపంచాయతీ పరిధిలోని దేవులపల్లి యాకయ్య నగర్ లో గత 8 సంవత్సరాల నుండి నిరుపేద ప్రజలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న అక్కడి ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని, తాగడానికి నీళ్లు లేక తల్లడిల్లుతున్నామని, తక్షణమే మంచి నీళ్లు



ఇప్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్డీవో రామ్ మోహన్ కు, ఇల్లందు తహసీల్దార్ సూర్యనారాయణ కు సిపిఎం మండల పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి రెవిన్యూ సిబ్బందికి ఎంక్వయిరీ నిర్వహించి ముందుగా మంచినీరు సౌకర్యం అలాగే మౌలిక సదుపాయాలు కల్పించుతామని హామీ ఇవ్వడం జరిగిందని పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన గుడిసె వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి గుడిసె వాసుల సమస్యలు కోసం సిపిఎం పార్టీ పోరాడుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించడం హర్షనియమని, అదేవిధంగా అక్కడి నిరుపేదలకు సర్వే నిర్వహించి ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడ అందేలా చేయాలని,అధికార్ల ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష వెంకన్న, సుజాత, కోటమ్మ,గోబిరియా,హుస్సేన్, మంగ, వైకుంఠం, రహీమ్ పాషా, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ని కలిసిన వెలుగుమట్ల బాధితులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం : భూదాన భూమిలో నివాసం ఉంటున్న పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడవేసిన సంగతి ఈ ప్రపంచానికి తెలిసినదే ఆ విషాదకరమైన ఘటన చూసి డాక్టర్ విశారదన్ మహరాజ్ మరియు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నా అమర నిరాహారదీక్షల అనంతరం 311 మందికి అదే వెలుగుమట్లలో ఇళ్ల పట్టాలు ఇవ్వటం జరిగినది . ఇంకా 500 మందికి ఇల్లు ఇవ్వకుండా రకరకాల కారణాల



చేత వారిని మోసం చేసింది . అందుకు విశారదన్ మహారాజ్ మరియు కవిత ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్ ని కలిసి వెలుగుమట్ల అంశాన్ని వివరంగా తెలియపరచడం జరిగిందిగ . గవర్నర్ కూడా అదే స్థాయిలో న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇవ్వడం జరిగినది .. ఇదివరకే జస్టిస్ చంద్రకుమార్ మరియు బాధితులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి తమ బాధను వెల్లపుచ్చుకున్నారు . శ్రీనివాస్ రెడ్డి తక్షణమే అందరికీ అదే స్థలంలో ఇల్లు నిర్మిస్తా అని మాటిచ్చారు కానీ ఇంతవరకు ఏమి చేయలేదు . ఈ సందర్భంగా విశారదన్ మారాజు మాట్లాడుతూ గవర్నర్ మీద మాకు పూర్తిగా నమ్మకం ఉందని బాధితులకు న్యాయం చేస్తారని అన్నారు . ప్రభుత్వం ఇంకా మొండి వైఖరిగా వెళితే అత్యంత భయంకరమైన ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట ముదిరాజ్ రాఘవేంద్ర , రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు , భూదాన బాధితుల కమిటీ కన్వీనర్ కె వి కృష్ణారావు , వట్టె ఉదయ్ కిరణ్ , మట్ట నవ్య , సోమ ఉమారాణి , షేక్ హమిద్ పాషా , శివరాత్రి కృష్ణ తదితరులు గవర్నర్ ని కలవడం జరిగినది .

# వరద విపత్తులు ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారు లతో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గతంలో ఖమ్మం జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధతే ప్రాణ నష్టాన్ని తగ్గించే మార్గమని పేర్కొన్నారు.వరదలు ముందస్తు హెచ్చరికలు లభించే విపత్తులని, సరైన ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. వరదల సమయంలో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ముఖ్య బాధ్యత అని అన్నారు. మానవ ప్రాణాలు, పశువుల ప్రాణనష్టం జరగకుండా చూడడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసి దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు కీలకంగా పనిచేయాలని పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం



చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో వెంటనే సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారుల కాంటాక్ట్ బుక్ సిద్ధంగా ఉండాలని తెలిపారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వరదల సమయంలో అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముంపుకు గురయ్యే గ్రామాలు, ప్రభుత్వ సంస్థలు, సంబంధాలు తెగిపోయే గ్రామాల జాబితా, కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వివరాలు ముందు గానే సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ని కుటుంబాలను తరలించాల్సి వస్తుందో, ఎన్ని పునరావాస కేంద్రాలు అవసరమవు తాయో, అందులో అవసరమైన సౌకర్యాలు ఏమిటో అన్న వివరాలతో ముందస్తు నివేదికలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.సంబంధాలు తెగిపోయే గ్రామాల్లో అవసరమైన నిత్యావసర వస్తువులు ముందుగానే తగినంత నిల్వ ఉంచాలని సూచించారు. కమ్యూనికేషన్ కోసం ప్రత్యేక వ్యక్తిని నియమించాలని ఆదేశించారు. అన్ని పెట్రోల్ బంకులను అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. వరదల సమయంలో అత్యవసర ఖర్చుల కోసం సంబంధిత శాఖలకు జిల్లా యంత్రాంగం ముందస్తు నిధులు అందజేస్తుందని,వాటిని బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.ప్రతి మండలంలో ఎంపీడీవో, ఎంఈఓ, ఎంపీఓ, తహసీల్దార్, పోలీస్ అధికారులు, వైద్య సిబ్బంది, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు సభ్యులుగా మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా మండలాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.పాత ఇళ్లు కూలిపోవడం వల్ల ప్రాణనష్టం సంభవిస్తున్నందున కూలిపోయే ప్రమాదంలో ఉన్న భవనాలను ముందుగానే గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, క్రాస్ రోడ్లు, లోతట్టు రహదారుల వద్ద ప్రజలు దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి వరదల సమయంలో పూర్తిగా మూసివేయాలని తెలిపారు. ప్రజలు దాటరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి మండలంలో భారీ చెట్లను గుర్తించి కొమ్మలు తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో వుడ్ కట్టింగ్ యంత్రం అందుబాటులో ఉండాలని తెలిపారు. అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో అవసరమైన డిమార్కేషన్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో పెచ్చులు ఊడిపోయే ప్రమాదంలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ప్రమాదకర గదులను వినియోగించరాదని సూచించారు. ముంపుకు గురయ్యే పాఠశాలల విషయంలో స్థానిక పరిస్థితులను బట్టి సెలవులు మంజూరు చేయాలని తెలిపారు. లోతట్టు, దూర ప్రాంత గ్రామాలు, కట్ ఆఫ్ గ్రామాలను ముందుగానే గుర్తించి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమయ్యే వారికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

కంది మండలం చర్లగూడెం గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన అమ్మవారి కళ్యాణం మొదలగు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ భూమయ్య, పి ఎస్ సి



ఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,ఉప సర్పంచ్ రమేష్ , ఆలయ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్,డీలర్ ప్రభు లింగం, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు,మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ జల మండలి ప్రధాన కార్యాలయంలో మంత్రుల సమీక్షా సమావేశం :

హైదరాబాద్ :మే 26, ( అక్షర కలం న్యూస్ ):

నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ సేవలు, వర్షాకాల సన్నద్ధత, కొనసాగుతున్న మౌలిక వసతుల పనులు, ఎస్టీపీల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం..పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరం లోని నీటి సమస్య , నదుల పరిరక్షణ మరియు నీటి సరఫరా మరియు పలు అంశాలపై మంత్రి గారి దృష్టి తీసుకొచ్చిన ఉన్నతాధికారులు..రానున్న పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని నీటి పొదుపు చేపట్టాలని , గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పెంచేలా కృషి చేయాలని ప్రతి ఒక్కరు బాధ్యతతో పని చేయాలని సూచించారు,.రవాణా శాఖ మంత్రి తాను పర్యావరణం పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్న విషయం గుర్తు చేశారు..ఆకుపచ్చగా తెలంగాణ గా మార్చడం లక్ష్యం గా రవాణా శాఖ ముందుకు సాగుతుంది అని తెలిపారు.అదే విధంగా నీతి పొదుపు చేసి నగరం ని నీటి కొరత లేకుండా చేయాలని ఆదేశించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# పట్టుదలతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరు : టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

### దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట : దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

సంగారెడ్డి ప్రతినిధి అక్షరకలం..

పట్టుదలతో ముందుకుసాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు టీజిఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ,తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం



దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలు సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టుదల, మనోధైర్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని కొనియాడారు. లక్ష్య సాధనకు కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పారు. దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను స్టాఫ్ నర్స్‌గా పనిచేసిన రోజుల్లో లెప్రసీ వార్డులో సేవలు అందించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, చేసే పనిలో సేవాభావం, నిబద్ధత ఉంటేనే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం...

# కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పరా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్దకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకలు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టీఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్–జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.




# జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ పై సస్పెన్షన్ వేటు

### రైతుల ఆవేదన గురించి మాట్లాడడమే నేరమా..?

### ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు మద్దతుగా నిలిచిన బి,ఆర్ ఎస్, బిజెపి, ప్రజా సంఘాలు.

జగిత్యాల మే 26 (అక్షర కలం)

తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, వరి ధాన్యం, మక్కల కొనుగోలు లేక గ్రామాల్లో రైతులు పడుతున్న ఆవేదనను దృష్టిలో పెట్టుకొని తాను మాట్లాడానే తప్ప వేరే ఉద్దేశం కాదని, అలాంటి నన్ను ఆర్టీసీ అధికారులు కక్షగట్టి



ఉద్యోగం నుండి తీసివేయడం అన్యాయమని జగిత్యాల ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా పని చేస్తున్న అశోక్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా చేపట్టిన ఆందోళన సందర్భంగా అటుగా వస్తున్న ఆర్టీసీ డ్రైవర్ అశోక్ “ముందు వడ్లు, మక్కల ను కొనమనండి తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల గురించి మాట్లాడండి”అంటూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఆర్టీసీ అధికారులు అశోకుని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తాను ఉద్యోగరీత్యా గ్రామాలకు వెళ్లినప్పుడు రోడ్లపై ఉన్న వడ్లను, మక్కలను చూస్తున్నానని, వాటిని కాపాడుకోవడం కోసం రైతులు పడుతున్న పాట్లు అన్నీ, ఇన్ని కావని, ఒకవేళ వర్షం పడితే ఆరు నెలలు కష్టపడి పండించిన పంట చేతి కందక రైతులు నష్టపోతారు అనే ఆవేదనతో మాట్లాడని తప్ప తనకు వేరే దురుద్దేశాలు లేవని, తాను ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని అశోక్ స్పష్టం చేశారు. రైతుల ఆవేదనను తాను వ్యక్తపరిస్తే తనను ఉద్యోగం నుండి తీసివేయడం ఎంతవరకు సమంజసం అని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్, బిజెపి, ఇతర ప్రజా సంఘాల నాయకులు ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు మద్దతుగా నిలిచారు. అశోక్ ను భేషరతుగా విధుల్లోకి తీసుకోకుంటే తాము ఆర్టిసి రీజనల్ మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మంత్రి గంగుల కమలాకర్ హెచ్చరించారు. ఆర్టీసీ అధికారుల తీరును బిజెపి నాయకులు కూడా తప్పు పట్టారు. వెంటనే అశోకుని విధుల్లోకి తీసుకోవాలని లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ లో స్థలం కేటాయింపు..

### జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడం లక్ష్యం..

### రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

జగిత్యాల మే 26 (అక్షర కలం) జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ శివారులోని సర్వే నెంబర్ 437లో స్థలం కేటాయించినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు కలిసి నర్సింగాపూర్ లోని కేంద్రీయ



విద్యాలయానికి కేటాయించే తలపెట్టిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఇన్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసి ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని నర్సింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం 6 ఎకరాల స్థలాన్ని సర్వే నెంబర్ 437లో కేటాయిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే రూ. 33 కోట్లతో ఐటిఐ, ఈ ఏటీసీ సెంటర్ ను ఇక్కడ ఏర్పాటు చేశామని వృద్ధ ఆశ్రమం సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని మంత్రి తెలిపారు. చల్ గల్ లోని వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన వాలంతరీ భూములను 12 ఎకరాలు కేంద్రీయ విద్యాలయానికి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కి కేటాయించడం జరిగిందని మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాల స్థలం సరిపోదని వివాదం నేపథ్యంలో నర్సింగాపూర్ లో ప్రభుత్వ భూమి కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం చల్ గల్ మరిన్ని వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన నేపథ్యంలో వ్యవసాయ పరిశోధనల భవిష్యత్తు అవసరాల కోసం అక్కడి భూములను అంతకు మించి కేటాయించే అవకాశం లేదని మంత్రి తెలిపారు. నర్సింగాపూర్ భూముల ప్రతిపాదనలు జిల్లా అధికారుల ద్వారా కేంద్రీయ విద్యాలయ అధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని ఎందుకు నిజామాబాద్ ఎంపీ అరవింద్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలని మంత్రి కోరారు

# బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి....

### – డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్....

మెదక్ /కొల్చారం మే 26(అక్షర కలం):–

99 ప్రజాపాలన ప్రణాళిక భాగంలో భాగంగా మెదక్ జిల్లాలను కలెక్టర్ కార్యాలయం నందు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు బాల్య వివాహం బతుకు ఆగమని నినాదంతో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం




నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనిసెఫ్ ప్రతినిధి డేవిడ్ రాజు బాల్యవివాల గురించి వాటి నివారించడంలో బాల్య వివాహ నిరోధక అధికారుల పాత్ర గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ ,డి ఆర్ డి ఏ , శ్రీనివాసరావు డి ఎం ఎచ్ ఓ శ్రీరామ్, డి పి ఓ , యాదయ్య నర్సాపూర్ మున్సిపల్ చర్మన్ విచ్చేసి మెదక్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని పిలుపునిచ్చారు. ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి స్వరూప రాథోడ్ మాట్లాడుతూ.. బాల్య వివాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత వహించాలని , మెదక్ జిల్లాని బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని , ఒకవేళ బాల్య వివాహాలు జరిగితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు మెడికల్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్లు పంచాయతీ సెక్రటరీలు ఏఎన్ఎం ఐసిపిఎస్ సిబ్బంది సిహెచ్ఎల్ సిబ్బంది హబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు.....

### – ప్రతి గింజను ప్రభుత్వం కొంటుంది..

### – ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నాం..

### – 38,402 మంది రైతుల అకౌంట్లో 423,52 కోట్ల రూపాయలు జమ....

### – జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్...

మెదక్ /కొల్చారం మే 26(అక్షరకలం):–


ధాన్యం కొనుగోలు ఈరోజు వరకు 2,65,639.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ,54,885 మంది రైతుల నుండి కొనుగోలు చేసి 38,402 మంది రైతుల అకౌంట్లో 423,52 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయనిపేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్––అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# టైటిల్ గెలవాలంటే ఆటగాళ్ళు రాణించాలి

## గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్

బ్యాటర్లతో మ్యాచ్‌లు గెలవచ్చని, టైటిల్ గెలవాలంటే మాత్రం బౌలర్లు రాణించాలని గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. అదృష్టవశాత్తు ఈ సీజన్‌లో తమ బౌలర్లు అదరగొడుతున్నాడని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో గుజరాత్ టైటన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.ఈ సందర్భంగా మాట్లాడిన శుభ్‌మన్ గిల్ పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే బౌలింగ్ ఎంచుకున్నానని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. పిచ్‌పై తేమ ఉన్నట్లు కనిపిస్తుంది. నిన్న వర్షం పడటంతో పిచ్ కొంచెం జిగటగా ఉంది. సెకండ్ ఇన్నింగ్స్ సమయంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారవచ్చు. మా బౌలర్ల అసాధారణ ప్రదర్శనతో వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గెలిచాం.మా బౌలర్లను మేం నమ్ముతున్నాం. బ్యాటర్లు మ్యాచ్‌లు గెలిపించవచ్చు. కానీ టైటిల్ గెలవాలంటే బౌలింగ్ విభాగం ఫామ్‌లో ఉండాలి. అదృష్టవశాత్తూ మా బౌలర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ సీజన్‌లో మా బౌలింగ్ విభాగం అత్యుత్తమంగా ఉంది. మాకు మంచి మూమెంటమ్ లభించింది. మా నిలకడైన ప్రదర్శనను కొనసాగించాలి.ప్రస్తుతం ఏ జట్టును తక్కువ అంచనా వేసే దశ కాదు. మేం తదుపరి రెండు మ్యాచ్‌లు గెలిచి టాప్-2లో నిలవాలనుకుంటున్నాం. టాప్-2లో నిలిస్తే అదనపు ప్రయోజనం చేకూరుతోంది. మరో మ్యాచ్ ఆడే అవకాశం దక్కుతుంది. ఆ మ్యాచ్ ఆడే పరిస్థితి రాకూడదని మేం కోరుకుంటున్నాం. కానీ ఆ ఆప్షన్ ఉండటం వల్ల సహజంగా ఆడే అవకాశం లభిస్తుంది. ఈ మ్యాచ్‌లో మేం మా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.మరోవైపు టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే అన్నాడు. పిచ్‌లో తేమ ఉన్నప్పటికీ, గాలులు వీస్తున్నాయని, సెకండ్ ఇన్నింగ్స్‌లో పెద్దగా మార్పు ఉండే అవకాశం లేదన్నాడు. తాము ఇంకా మూడు మ్యాచ్‌లు గెలవాలని, ఒక్కో మ్యాచ్ గెలిచి, ఆ తర్వాత ఏం జరుగుతుందో చూడాలన్నాడు. గత ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు గెలవడం సంతోషంగా ఉందని, తమ జట్టు కాంబినేషన్ కూడా సెట్ అయ్యిందన్నాడు. ఏది ఏమైనా బ్యాటింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి, బౌలింగ్ సత్తా చాటే ప్రయత్నం చేస్తామని తెలిపాడు. వరుణ్ చక్రవర్తి జట్టులోకి తిరిగి వచ్చాడని చెప్పాడు.





# రిషబ్ పంత్‌కు బీసీసీఐ బిగ్ షాక్!

సీఎస్కేతో జరిగిన కీలక మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత విజయాన్ని సాధించింది. లక్నో జట్టు గెలిచినా ఆ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ కు బీసీసీఐ బిగ్ షాక్ ఇచ్చింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ పంత్‌పై బీసీసీఐ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. లక్నోలోని ఎకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రిషబ్ పంత్ కు రూ.12 లక్షల జరిమానా విధించింది. ఐపీఎల్ ప్రవర్తన నియమావలిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం కనీస ఓవర్ రేట్ నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు రిషబ్ పంత్‌ను దోషిగా తేల్చారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఈ సీజన్లో ఇది మొదటి తప్పిదం కావడంతో కేవలం కెప్టెన్‌కు మాత్రమే రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఒకవేళ ఇదే తప్పు మళ్లీ పునరావృతమైతే జరిమానా మొత్తం పెరగడంతో పాటు జట్టులోని మిగిలిన సభ్యులకు కూడా మ్యాచ్ ఫీజులో కోత పడే అవకాశం ఉంటుంది. ఈ సీజన్ ముగియడానికి మరో 15 రోజులు మాత్రమే ఉండటంతో మ్యాచ్‌ల తీవ్రత దృష్ట్యా బౌలింగ్ సమయాన్ని నియంత్రించడం కెప్టెన్లకు పెద్ద సవాలుగా మారింది.ఈ మ్యాచ్‌లో లక్నో జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంపై కెప్టెన్ రిషబ్ పంత్ సంతోషం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్‌లో రిషబ్ పంత్ మాట్లాడుతూ.. ఈ విజయం జట్టు నైతిక స్థైర్యాన్ని ఎంతగానో పెంచిందని అన్నాడు. ఈ సీజన్ ఎలా ముగిసినా సరే, లక్నో జట్టుగా గర్వపడేలా ఆడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. అలాగే జట్టులోని ఆటగాళ్లందరికీ స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని, తీవ్రమైన ఒత్తిడి ఉండే ఇలాంటి టోర్నమెంట్లలో వ్యూహాలను చాలా సరళంగా ఉంచుకోవడం ముఖ్యమని పంత్ పేర్కొన్నాడు. ఇదే క్రమంలో లక్నో పేసర్ ఆకాష్ సింగ్ ప్రదర్శనను రిషబ్ పంత్ ప్రత్యేకంగా అభినందించాడు. ఆకాష్ సింగ్ ప్లాన్స్ మార్చుకుండా క్రమశిక్షణతో బౌలింగ్ చేశాడని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని కొనియాడాడు. అలాగే టాక్టికల్ నిర్ణయాల్లో భాగంగా ఇద్దరు విదేశీ ఆటగాళ్లను ఓపెనర్లుగా పంపి, నికోలస్ పూరన్‌ను వన్ డౌన్‌లో (నంబర్ 3) బ్యాటింగ్‌కు పంపాలనే వ్యూహం కూడా తమకు బాగా కలిసివచ్చిందని రిషభ్ పంత్ వివరించాడు.




అక్షరకలం
తెలుగు దినపత్రిక



## సినిమా
CINEMA



# వినాయక చవితికి జైలర్-2 ?

'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.



# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్

సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరఫున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.



# ఓటిటిలోకి మోహన్ లాల్, మమ్ముట్టిల పేట్రియాట్

మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన ఇద్దరు అగ్ర కథానాయకులు మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి నటించిన భారీ మల్టీస్టారర్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'పేట్రియాట్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో పొలిటికల్ అండ్ స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే థియేటర్లలో విడుదలైన కొన్ని వారాలకే ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ జీ5 ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా.. జూన్ 5 నుంచి ఈ సినిమాను డిజిటల్ ఎ÷–లాట్‌ఫారమ్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీ5 వెల్లడించింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం ఒకేసారి స్ట్రీమింగ్ కానుంది. మమ్ముట్టి, మోహన్‌లాల్ చాలా కాలం తర్వాత స్క్రీన్ షేర్ చేసుకోవడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా, ఇందులో ఫహాద్ ఫాజిల్ ప్రధాన విలన్ పాత్రలో నటించారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# బాల్య వివాహాల రహిత తెలంగాణే లక్ష్యం - జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు, బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుండి నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ వారం నల్గొండ పట్టణంలోని రెడ్ క్రాస్ భవనంలో మహిళ, శిశు,



దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహల రహిత తెలంగాణ లక్ష్యంతో బాల్య వివాహ నిషేధ చట్టం--2006 పై విద్యార్థులకు ఉద్దేశించి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్




ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి, బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలి, బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలు దెబ్బతింటున్నాయి, కుటుంబాల్లో ఆవేదన మిగులుతున్నదని అన్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని, బాలికలు సంఘాలుగా ఏర్పడి తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ ద్వారా పిల్లలకు అనేక అవకాశాలు కల్పిస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాను అతి మోతాదులో ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని, ఏఐ ఫోటో మార్ఫింగ్ వంటి సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమని, సమాజంలో తలెత్తుకుని జీవించేలా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రణామం వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు క్యారంస్ ఆడుతుండగా వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు. అవగాహన కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సి డి పిఓ లావణ్య, సి డబ్ల్యు సి చైర్మన్ చింత కృష్ణయ్య, సి డబ్ల్యు సి సభ్యులు భాస్కర్ వెంకన్న, డిసిపిఓ గణేష్ హాజరయ్యారు.

## జూన్ 3న నకెరికల్‌లో టీయూడబ్ల్యూజే మహాసభ

**జిల్లాలో సభ్యత్వ క్యాంపెయిన్ కు అనూహ్యమైన స్పందన**

**27న సాయంత్రం తో సభ్యత్వాల నమోదు ముగింపు**

**టీయూడబ్ల్యూజే(ఐజేయు) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి**

నల్లగొండ, మే 26:::

జూన్ 3 వ తేదీన నకెరికల్ నియోజకవర్గ కేంద్రంలో టి యు డబ్ల్యూ జే ( ఐజేయు ) జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం నల్లగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం గారు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి గారు , టి యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ గారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామ నారాయణ గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ. ప్రభాకర్ రెడ్డి గారు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ కు ప్రింట్,ఎలక్ట్రాన్ మీడియా, చిన్న పత్రికలు, ఫోటో జర్నలిస్టులు,వీడియో



జర్నలిస్టుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికిని సంఘం బాధ్యులంతా సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 27న సాయంత్రంతో సభ్యత్వ నమోదు ముగుస్తుందని పేర్కొన్నారు. ఇంకా సభ్యత్వ నమోదు పొందని వారు ఎవరైనా ఉంటే స్థానిక మండల నియోజకవర్గ జిల్లా బాధ్యులను సంప్రదించి సభ్యత్వ ము తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు హక్కుల కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులను అందిస్తామని ఇందుకోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

## ఉచిత యూపీఎస్సీ కోచింగ్

అక్షరకలం నల్గొండ

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ (హైదరాబాద్) ఆధ్వర్యంలో యూపీఎస్సీ -- సీఎస్ఈ 2027 పరీక్షకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థుల కోసం 2026-2027 విద్యా సంవత్సరానికి గానూ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి. విజయేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన అర్హులైన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ అభ్యర్థులు ఈ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఏదైనా సాధారణ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు అర్హులు. ? హైదరాబాద్‌లోని స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరికీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ప్రాతిపదికన మాత్రమే ఎంపిక ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, అలాగే అన్ని కేటగిరీలలో వికలాంగులకు 5శాతం సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 31వరకు అవకాశం ఉంది. ప్రవేశ పరీక్ష జూన్ 14న ఉంటుందని తెలిపారు.

## విధి నిర్వహణలో ఫిట్నెస్ తప్పనిసరి...



అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ

ఎస్. పి. ఎఫ్ సిబ్బంది ఫిట్నెస్ సరిగ్గా ఉన్నప్పుడే విధి నిర్వహణ సక్రమముగా నిర్వహించగలుగుతామని ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్లు ప్రతాప్ నాయుడు,శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, జోన్ డి ఐ జి మాధవరావు ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్. పి. ఎఫ్ ఆధ్వర్యంలో పైలాన్ పిల్లర్ నుండి హిల్ కాలనీ డౌన్ పార్క్ వరకు 10 కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. దీనితోపాటు శారీరక దారుఢ్యం కోసం పలు రకాల ఫిజికల్ ఎక్సర్సైజులు నిర్వహించమన్నారు. ఎస్ పి ఎఫ్ సిబ్బంది నిత్యం తమ ఫిట్నెస్ పై దృష్టి సారించాలని ఫిట్నెస్ సరిగ్గా ఉన్నప్పుడే చురుగ్గా తమ విధులలో పాల్గొనగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్కో ఎస్ పి ఎఫ్ అధికారులు, సిబ్బంది, నాగార్జునసాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెల్లి లలితక్క విగ్రహ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే

యాదాద్రి భువనగిరి అక్షర కలం

తెలంగాణ గాన కోకిల, సామాజిక ఉద్యమకారిణి బెల్లి లలితక్క విగ్రహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం మంగళవారం భువనగిరి అమరవీరుల సంస్మరణ స్థూపం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి భువనగిర శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అంతకు ముందు అమరవీరుల స్థూపం వద్ద బెల్లి లలిత 27 వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బెల్లి లలితక్క తన గానంతో ప్రజల్లో చైతన్యం నింపి ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఆమె పాటలు ఉద్యమ చైతన్యాన్ని, స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించాయన్నారు. తెలంగాణ సాధనలో ఆమె చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. భావితరాలకు ఆమె సేవలను గుర్తుచేసే




విధంగా ఈ విగ్రహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ , భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి – రవికుమార్, వైస్ ఛైర్మన్ పోతంశెట్టి మంజుల –వెంకటేశ్వర్లు, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ , కౌన్సిలర్లు, పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు, విగ్రహ స్థాపక కమిటీ సభ్యులు బెల్లి సూర్య ప్రకాష్, జెన్ని వెన్నెల, పార్టీ నాయకులు, కుల, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నందికొండ నివాసులకు ఎన్ఎస్పి నోటీసులు....

**మున్సిపల్ ఎన్నికల్లో 58 , 59 జీవో ప్రకారం గృహాలు అందిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి...**

**ఎన్నికల తర్వాత హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం...**

అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ

నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎన్ఎస్పి క్వాటర్స్ లో కొన్ని సంవత్సరాలుగా నివాసముంటున్న నివాసితులకు ఇల్లు ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇవ్వడం పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డ్యాం పర్యావేక్షక ఇంజనీర్ ఆఫీసులో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారాం నాయక్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు రమేష్ జి , టిఆర్ఎస్ నాయకుడుమాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎన్ఎస్పి క్వార్టర్స్ లో నివాసముంటున్న నివాసితులకు ఇల్లు ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇవ్వడం ఎంతో దారుణమని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడ సభా వేదిక పై సీఎం రేవంత్ రెడ్డి 58, 59 జీవో ప్రకారం నివాసితులకు గృహాలు అందిస్తామని హామీ ఇచ్చి, ఎన్నికల అనంతరం అట్టి హామీని తుంగలో తొక్కారని అన్నారు .58 , 59 జీవోల ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లకు సైతం నోటీసులు ఇవ్వడం హాస్య స్పదమని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఎన్ఎస్పి అధికారులు , స్థానిక శాసనసభ్యులు స్పందించి నివాసితులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఇట్టి చర్యలను ఇప్పటికైనా ఆపకుంటే స్థానిక



సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ ఆధ్వర్యంలో ప్రజల తరపున పోరాడటానికి నందికొండ టిఆర్ఎస్ పార్టీ ముందు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు రమేష్ జి, 8వ వార్డు కౌన్సిలర్ ముఖ్య సలహాదారుడు నకరికంటే సైదులు, 2వ వార్డు ఇన్చార్జ్ మహమ్మద్ గని, 4 వ వార్డ్ ఇంచార్జ విజయ్, 6 వ వార్డ్ ఇంచార్జి చంద్రమౌళి నాయక్, 10 వార్డు ఇంచార్జ్ కోడా విజయ్, ఆదాసు విక్రమ్, నరేష్, నజీర్, షరీఫ్, ఎస్కే రఫీ భాష, శేఖరా చారి, లక్ష్మణ్ నాయక్, కోదండ, దార రవి, తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు కేజీబీవీకి 'కార్పొరేట్' కళ

**మాస్టర్ ప్లాన్‌తో రంగంలోకి ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి**

అక్షరకలం చౌటుప్పల్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే లక్ష్యంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సరికొత్త అడుగులు వేస్తున్నారు. ఒకవైపు తన తల్లి 'కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్' ద్వారా విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. ?ఇప్పటికే మర్రిగూడ మండల కేంద్రంలో సుమారు రెండు కోట్ల రూపాయల సొంత నిధులతో అద్భుతమైన తరగతి గదులు, వసతులు కల్పించిన ఎమ్మెల్యే.. ఇప్పుడు మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం రూపురేఖలను మార్చడానికి శ్రీకారం చుట్టారు.

**మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే...**

నిన్న మునుగోడు కస్తూరిబా పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి, పాఠశాల ఆవరణ అంతా కలియతిరిగి పరిశీలించారు. విద్యార్థినులకు ఎలాంటి వసతులు కావాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే స్పందిస్తూ.. తన వ్యక్తిగత ఇంజనీర్‌తో 'మాస్టర్ ప్లాన్' తయారు చేయిస్తానని మాట ఇచ్చారు.చెప్పిన మాట ప్రకారం, వెంటనే తన వ్యక్తిగత ఇంజనీర్ నారాయణను పిలిపించుకుని, ఆయనతో కలిసి మళ్లీ పాఠశాలను సందర్శించారు. 400 మంది విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఆధునిక నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు పూర్తి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఇంజనీర్ నారాయణకు ఎమ్మెల్యే పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. మునుగోడు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే తీసుకుంటున్న ఈ చర్యలపై విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## గ్రామ ప్రజలకు అందుబాటులో లేని పంచాయతీ కార్యదర్శి

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు తప్పవు**

**ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ హెచ్చరిక**

అక్షరకలం దేవరకొండ

మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ ఆరోపించారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న తాగునీటి సమస్యలు, శుద్ధి చేసిన నీటి కేంద్రం (ఆర్వో ప్లాంట్) నిర్వహణ లోపాలు, అలాగే వివిధ రకాల ధృవపత్రాల కోసం గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి వస్తే తాళాలు దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు.




అత్యవసర పనుల నిమిత్తం కార్యదర్శికి ఫోన్ చేసినా ఆయన స్పందించకపోవడం సరైన విధానం కాదన్నారు."ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై గతంలో అనేకసార్లుఉన్నతాధికారులు చర్యలు సంబంధిత ఉన్నతాధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించి, చొరవ తీసుకోవా లని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా చూడాలని, గ్రామస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవేళ అధికారుల తీరు మారకపోతే.. గ్రామ ప్రజలను సమీకరించి మండల పరిషత్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని శ్రీకాంత్ హెచ్చరించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

**మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్**

అక్షర కలం,(చౌటుప్పల్):

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్. ఈ నేపథ్యంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,సమస్యలను తెలుసుకుని వైద్యులు,సిబ్బందికి రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని సూచించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా,వైద్యానికి అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారని,రానున్న మునుముందు రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రులు మరింత బలోపితం అవుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజలు,త దితరులు ,పాల్గొన్నారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# కొనుగోళ్లపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రివ్యూ

**హమాలీల కోసం సొంత నిధులు రూ.10.20 లక్షల సాయం**

**సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**

**నియోజకవర్గంలో 9 లక్షల క్వింటాళ్ల సామర్థ్యంతో కొత్త గోదాముల నిర్మాణం**

**అక్షరకలం చౌటుప్పల్**

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, నిల్వ సామర్థ్యం, ఎదురవుతున్న సమస్యలపై మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్గొండ, యాదాద్రి జిల్లాల అధికారులతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నల్గొండ జిల్లా పరిధి (మునుగోడు, చండూరు, ఘట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ) గత ఏడాది 2,85,560 క్వింటాళ్ల సేకరణ జరగగా, ఈసారి దిగుబడి 4,20,430 క్వింటాళ్లకు పెరిగింది. ఇప్పటివరకు 3,52,300 క్వింటాళ్ల కొనుగోళ్లు పూర్తి కాగా, ఇంకా కల్లాలలో 68,130 క్వింటాళ్ల ధాన్యం ఉంది. యాదాద్రి జిల్లా పరిధి (చౌటుప్పల్, నారాయణ్‌పూర్) గత సంవత్సరం కంటే ఈసారి రెండింతలు ఎక్కువ దిగుబడి వచ్చింది. ఇప్పటివరకు 2,36,215 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. అంచనాలకు మించి దిగుబడి రావడం, హమాలీలు, లారీల కొరత వేధించడం, కొన్ని స్థానిక మిల్లులు బ్లాక్ లిస్టులో ఉండటం, నిల్వ సామర్థ్యం లేకపోవడం వల్లే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రైతుల ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, హమాలీల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ఇచ్చే కూలీకి అదనంగా తన





సొంత నిధులు రూ. 10,20,000 తక్షణ సహాయంగా అందిస్తానని ప్రకటించారు. ?భవిష్యత్తులో నిల్వ సమస్యలు రాకుండా మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ముందస్తు ప్రణాళికలు వేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో మొత్తం 9 లక్షల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యంతో కొత్త గోదాముల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ?చౌటుప్పల్ 4 లక్షల క్వింటాళ్లు, మునుగోడు 2 లక్షల క్వింటాళ్లు, నారాయణ్‌పూర్ 2 లక్షల క్వింటాళ్లు, నాంపల్లి 1 లక్ష క్వింటాళ్ల సామర్థ్యంతో గోదాములు నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో నల్గొండ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డితో పాటు సివిల్ సప్లైస్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు, మండలాల తహశీల్దార్లు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కోదాడ మహానాడుకు తెదేపా శ్రేణులు తరలిరావాలి

**కోఆర్డినేటర్లు ముత్తినేని సైదేశ్వర రావు, ఒరుగంటి ప్రభాకర్**



**అక్షరకలం కోదాడ**

నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా వర్చువల్‌గా నిర్వహించబోయే తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మహానాడు కోఆర్డినేటర్లు ముత్తినేని సైదేశ్వరరావు, ఓరుగంటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ పట్టణంలో పార్టీ ముఖ్య నాయకులతో మహానాడు ఏర్పాట్లపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నేడు, రేపు రెండు రోజులపాటు కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.పార్టీ అధినేత ఆదేశాల మేరకు నల్గొండ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలను అనుసంధానం చేస్తూ ఈ వర్చువల్ మహానాడును కోదాడలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మరింత నూతన ఉత్తేజంతో ముందుకు సాగేందుకు, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణను రూపొందించేందుకు ఈ మహానాడు వేదిక కానుందని, కావున నియోజకవర్గంలోని తెదేపా అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు భయ్యా నారాయణ, కొల్లు నరసయ్య, సాతులూరి గురవయ్య, బండ్లమూడి వెంకటేశ్వరరావు, గుండు నాగేశ్వరరావు, పిట్టల శోభన్ బాబు, పాల్గొన్నారు.

# కాపుగల్లు గ్రామం కాలనీలో అగ్ని ప్రమాదం

అక్షరకలం కోదాడ

కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో కొంతమంది వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో ఆ మంటలు రైతు వేదిక సమీపంలో నీ కాలనీలో నీ గుడిసెలకు అంటుకుని కొన్ని ఇండ్లు , ప్రకృతి వనం కొంతమేర కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ ఫైర్ సిబ్బంది లేకపోవడంతో కాలనీవాసులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు వేలది పద్మావతి కాలనీ వాసులకు సహాయ సహకారాలు అందించి మాట్లాడారు. 10 ఇండ్లు దగ్ధం అయినాయి అని తెలిపారు. ప్రభుత్వం కాలన ౌవాసులకు పక్కాభవనాలు కట్టించి ఇవ్వాలని ఆమె కోరారు. కాలనీవాసులు మంటలను గమనించకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని ఆమె తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించి పక్క ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నల్లగొండలో పోలీస్ 'అష్టదిగ్బంధం'



**తెల్లవారుజామున భారీ కార్డెన్ అండ్ సెర్చ్**

**360 ఇళ్లలో సోదాలు..**

**54 బైకులు, గుట్కా సీజ్**

**ఇద్దరు రౌడీషీటర్లు, 46 మంది అనుమానితుల గుర్తింపు**

**శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ**



## శరత్ చంద్ర పవర్ హెచ్చరిక

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**

నగరం లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ అధ్వర్యంలో భారీ ఉమ్మడి తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ నగరాని పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. ఎప్పుడూ రద్దీగా ఉండే సతీష్ నగర్‌తో పాటు పలు సమస్యాత్మక ప్రాంతాల్లో 10 ప్రత్యేక బృందాలుగా విడిపోయి విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.అనుమానితుల గుర్తింపు, అక్రమ కార్యకలాపాల అరికట్టడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక తనిఖీలు సాగాయి.

**రంగంలోకి నార్కోటిక్ డాగ్స్ స్పెషల్ రౌండ్స్...**

నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఏడుగురు సీఐలు, 18 మంది ఎస్ఐలతో పాటు సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ బృందాలు నగరం లోని పలు కాలనీలు, అనుమానిత ప్రాంతాలు, లాడ్జీలు, అద్దె గదులు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా పెట్టి జల్లెడ పట్టాయి. మత్తు పదార్థాల గుర్తింపు కోసం ప్రత్యేకంగా 'నార్కోటిక్ డాగ్'ను కూడా రంగంలోకి దించారు.



**తనిఖీల వివరాలు రికవరీ...**

సుమారు 360 ఇండ్లలో నిర్వహించిన ఈ సోదాల్లో పోలీసులు భారీగా వాహనాలను, నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 46 మంది అనుమానితులను గుర్తించి వారి వివరాలను సేకరించారు. పట్టణంలో నివసిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మందిని గుర్తించారు. వీరిలో ఉత్తరప్రదేశ్ (10), బీహార్ (4), హర్యానా (2), తమిళనాడు (1), అస్సాం (1) రాష్ట్రాల వారు ఉన్నారు. తనిఖీల్లో ఇద్దరు రౌడీషీటర్లు, ఐదుగురు ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి, వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆరుగురికి గంజాయి పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరు గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులను పోలీసులు సీజ్ చేశారు. సరైన పత్రాలు లేని 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో విపరీతమైన శబ్ద కాలుష్యం (సైలెన్సర్ మోడిఫికేషన్) చేస్తున్న రెండు వాహనాలు ఉన్నాయి. వీటితో పాటు 4 సెల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, నగరం లో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో ప్రజల రక్షణ కోసం ఇటువంటి సర్ప్రైజ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నల్గొండలో 'కరెంటు' కష్టాలు తీరుస్తాం

**రూ.303 కోట్లతో అభివృద్ధి పనులు**

**మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

**త్వరలోనే మూడు కొత్త సబ్‌స్టేషన్లు**

**ప్రతిరోజూ కృష్ణజలాల సరఫరాయే లక్ష్యం**

**మురుగు కాల్వల పూడికతీత, వీధి కుక్కల నివారణపై కార్పొరేటర్ల ఆగ్రహం**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఎండల తీవ్రత దృష్ట్యా పట్టణంలో ఏర్పడుతున్న లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని నల్గొండ నగరపాలక సంస్థ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మేయర్ అధ్యక్షతన జరిగిన నగరపాలక సంస్థ సాధారణ సమావేశం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి, తాగునీరు, విద్యుత్ సమస్యలపై కౌన్సిల్‌లో సుదీర్ఘంగా చర్చించారు.

?వేసవి కాలంలో ప్రజలు ఏసీలు, కూలర్లు ఎక్కువగా వాడుతుండటం వల్ల లో వోల్టేజ్ సమస్య వస్తోందని మేయర్ పేర్కొన్నారు. దీనిని అధిగమించేందుకు త్వరలోనే మూడు కొత్త సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల (నియంత్రికలు) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



**ఇంటింటికీ కృష్ణజలాలు..**

పట్టణ ప్రజలకు ప్రతిరోజు కృష్ణజలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మేయర్ తెలిపారు. తాగునీటి వ్యవస్థను





మరింత బలోపేతం చేసేందుకు, ప్రతి ఇంటికీ నిరంతరాయంగా నీరు సరఫరా చేసేందుకు రూ.100 కోట్లతో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

**టూరిజం హబ్‌గా నల్గొండ..**

నల్గొండ నగరాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు రూ.303 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మేయర్ వివరించారు. వీటితో పాటు అర్బన్ చాలెంజ్ ఫండ్ ( యు సి ఎఫ్) స్కీం కింద రూ.283 కోట్లతో నల్గొండను సుందరీకరించి, అద్భుతమైన టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత వల్ల సీసీ రోడ్ల నిర్మాణం కాస్త ఆలస్యమవుతోందని, త్వరలోనే పనుల్లో వేగం పెంచుతామన్నారు.

**అధికారులపై కార్పొరేటర్ల ఆగ్రహం..**

నగరం లో తరచూ కరెంటు కోతలు, అంతరాయాలు కలగడం వల్ల తాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతోందని పలువురు కార్పొరేటర్లు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి కుక్కల నివారణకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా, వాటిని నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అని 33వ డివిజన్ కార్పొరేటర్ రేగట్టే అండాలు లింగస్వామి సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.?మురుగు కాల్వల పూడికతీత.. వర్షాలు రాకముందే మురుగు కాల్వల్లోని సిల్ట్ (పూడిక) తొలగించాలని, సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మేయర్.. తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర, ఈఈ రాములు, ఏసీపీ కృష్ణవేణిలతో పాటు కార్పొరేటర్లు దొడ్డి రమేష్, మారగోని భవానీగణేష్, దీప్లానాయక్, పెరిక యాదయ్య, పేర్ల మహేశ్వరి అశోక్, కుందురు ప్రవీణ్ కుమార్ రెడ్డి, గోపగాని స్వాతి రాజశేఖర్, ఇబ్రహీం, మారగోని నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**చీకట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు**

నల్లగొండ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా అనూహ్యంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. నగర సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్రంగా చర్చిస్తున్న సమయంలో ఒక్కసారిగా కరెంటు పోవడంతో హాల్ అంతా చీకటిగా మారింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోతకు గురైన కార్పొరేటర్లు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మైకులు పనిచేయకపోవడంతో కొన్ని నిమిషాల పాటు చర్చలకు బ్రేక్ పడింది. కొందరు సభ్యులు తమ సెల్‌ఫోన్ టార్చ్ లైట్ల వెలుతురులోనే కూర్చోవాల్సి వచ్చింది. నగర మున్సిపల్ ప్రధాన కార్యాలయంలోనే ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తడంపై సభ్యులు కాస్త అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగి, సమావేశం యథావిధిగా కొనసాగింది.

# శభాష్ చామంతుల భారతమ్మ



**ఉపాధి హామీ కూలీల ప్రాణాలు కాపాడిన చామంతుల భారతమ్మ**

**అక్షర కలం సిద్దిపేట మే 26:**

సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం పాలమాకులలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటనలో ఉపాధి హామీ కూలి చామంతుల భారతమ్మ వీరనారిలాగా ధైర్యం కోల్పోకుండా 8 మంది కూలీల ప్రాణాలు కాపాడి శభాష్ భారతమ్మ అనిపించుకున్నారు. ప్రమాదం అనంతరం ముందుకు వెళ్తున్న ట్రాక్టర్ ను ఆమె పరిగెత్తుకు వెళ్లి బ్రేకులను రెండు చేతులతో గట్టిగా పట్టుకొని ఆపేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడిన కూలీలు ఊపిరి పీల్చుకుని ఈరోజు ఆమె లేకపోతే ట్రాక్టర్ కూలీలపై నుంచి దూసుకెళ్లి ఉండేదని తోటి కూలీలు తెలిపారు. స్థానికులు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తూ అభినందించారు.

# మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

**అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000/- ఆర్థికసహాయం**

**ఎంపీడీఓ మహమ్మద్ మహబూబ్ అలీ**

**అక్షర కలం సిద్దిపేట మే 26:**



ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులలో భాగంగా పాలమాకుల గ్రామానికి చెందిన రేపాక మహిపాల్ రెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందడం విచారకరం. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే నంగునూరు ఎంపీడీఓ మహమ్మద్ మహబూబ్ అలీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతుని తండ్రి రేపాక బాల్ రెడ్డికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000/- ఆర్థికసహాయంఅందజేశారు.అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ.2,00,000/- ఎక్స్‌గ్రేషియా, ఎన్ఎఫ్‌బీఎస్ (చీఖీదీూ) పథకం కింద రూ.20,000/- ఆర్థిక సహాయం, మృతుని భార్యకు ప్రతి నెల రూ.2,016/- విధవ పింఛన్ మరియు సుమారు రూ.5.00 లక్షల అంచనా వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు తదితర ప్రభుత్వ సహాయాలు తదుపరి దశలో మంజూరు చేయబడనున్నట్లు ఎంపీడీఓ మహమ్మద్ మహబూబ్ అలీ తెలిపారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు.

# ఉపాధి హామీ పని వద్ద ట్రాక్టర్ టైర్ల కింద పడి డ్రైవర్ మృతి

**అక్షర కలం సిద్దిపేట మే 26:**



సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకులలో ఉపాధి హామీ పథకం పనులలో రహదారి కోసం కూలీలతో ట్రాక్టర్ లో మట్టిని తరలిస్తుండగా ట్రాక్టరు నడుపుతున్న ఉపాధి హామీ కూలీ, డ్రైవర్ రేపాక మహిపాల్ రెడ్డి(43) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మట్టి నింపేందుకు నిలిపి ఉంచే క్రమంలో ట్రాక్టర్ పల్లం వైపు జారుతుండడంతో చక్రాల కింద రాయి పెట్టేందుకు మహిపాల్ రెడ్డి ప్రయత్నించాడు. ఈ క్రమంలో మహిపాల్ రెడ్డి జారి పడ్డాడు. దీంతో ట్రాక్టర్ చక్రాలు మహిపాల్ రెడ్డి మీదుగా పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన సమయంలో ట్రాలిలో కూలీలు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామాల్లో విషాదం నెలకొంది.

**కేసు నమోదు.. దర్యాప్తు**

ప్రమాద విషయం తెలిసిన వెంటనే రాజగోపాలపేట ఎస్సై వివేక్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా తోకల మల్లయ్య వ్యవసాయ బావి వద్ద ఎత్తుగడ్డకు ట్రాక్టర్ ఆపి, ట్రాక్టర్ జారకుండా టైర్ల కింద రాయని పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు రేపాక మహిపాల్ రెడ్డి కింద పడి చనిపోయాడని ఎస్సై వివేక్ తెలిపారు. ట్రాక్టర్ మహిపాల్ రెడ్డి పొట్టపై నుండి వెళ్లడంతో తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడని చెప్పారు. వెంటనే అతనిని 108 అంబులెన్స్ ద్వారా సిద్ధిపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా,అక్కడ పరీక్షించిన వైద్యులు మహిపాల్ రెడ్డి అప్పటికే చనిపోయారని ధృవీకరించారనితెలిపారు.మహిపాల్ రెడ్డి భార్య రేపాక కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు రాజగోపాల్ పేట ఎస్సై వివేక్ వివరించారు.

# రైతులు అపోహలు, వదంతులు నమ్మవద్దు.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 26:**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు అసత్య ఆరోపణలతో కలిగించే అపోహలు, వదంతులను రైతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత, కొనుగోళ్ళలో పూర్తిస్థాయి నిలిచిపోయిన పరిస్థితి లేదని, అవసరానికి అనుగుణంగా లారీలు, హమాలీలు, గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో దాదాపు 1 లక్ష 50 వేల నుండి 1 లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుండగా, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1 లక్ష 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను 10 నుండి 12 రోజులలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతున్నామని, గతంతో పోలిస్తే ఈసారి కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, పౌరసరఫరాలు, ఎస్ డబ్ల్యూసి శాఖల అధికారులు నిరంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులను కోరారు.




# పంట కొనుగోళ్ల అలసత్వం వల్ల ఇబ్బందులు పడుతున్న రైతుల వద్దకు స్వయంగా వెళ్లి పరిస్థితులను పరిశీలించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

**అక్షర కలం సిద్దిపేట మే 26:**



సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో రైతులు ఎంతో కష్టపడి పండించిన ప్రొద్దుతిరుగుడు, వడ్లు, మొక్కజొన్న పంటలను వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు చేయడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి మార్కెట్ యార్డులోనే నిరీక్షిస్తున్న రైతుల పరిస్థితిని తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి స్వయంగా మార్కెట్ యార్డుకు చేరుకొని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడానికి మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం బాధాకరం. గేట్లు కూడా తెరవకపోవడంతో రైతులు ట్రాక్టర్లు, వాహనాలతో బయటే నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా రైతుల బాధలను విన్న వంగ రాజేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో నేరుగా మాట్లాడి పంటల కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కాలని, రైతు చెమట వృథా కాకూడదని ఆయన స్పష్టం చేశారు.పంటలను కొనుగోలు చేయక ఆలస్యం చేయడం వల్ల రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డిరైతులకు అండగా ఎల్లప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. రైతు సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, రైతుల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. వంగ రాజేశ్వర్ రెడ్డి స్పందనపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యలను వెంటనే గుర్తించి అధికారులతో మాట్లాడడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 26:**

రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్, శ్రీ సాయి మణికంఠ రైస్ మిల్ లను మండల తహశీల్దార్ పుష్పలతతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, దాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు



ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము, ఇటిక్యాల లోని కొనుగోలు కేంద్రాన్ని మండల తహశీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతోపాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని ఎసిసి ప్రాంతంలో గల హనుమాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి, తాండూర్ (కోటపల్లి ఇంచార్జ్) తహశీల్దార్లు రఫతుల్లా, కృష్ణ, జ్యోత్స్న లతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం రైతుల కొరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి వివోఏ నిరవదిక సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ మద్దతు



**మందమర్రి, మే 26 అక్షర కలం:**

మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివోఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని మంగళవారం బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వస్తే ప్రజల బతుకులు బాగుపడతాయని, రాష్ట్రాన్ని సాధిస్తే తెలంగాణ ప్రజల బతుకులు ఆగమవుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం, ఇప్పుడున్న ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి గద్దె ఎక్కి ప్రజలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వస్తే అర నిమిషంలో అన్ని పనులు చేస్తామని, ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తమ కండ్లు తెరిచి ఇచ్చిన చిన్న చిన్న హామీలు నెరవేర్చాలని, ఐకేపీ వివోఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజవర్గం అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎండి మతిన్ ఖాన్, పట్టణ నాయకులు ఐలేను రాజు, వివోఏ నాయకులు ఎ వనజ, వెంకటేష్, ఎం పావని, కామెర తుకారాం తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దాం...

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 26:**



బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళ సంక్షేమ వారోత్సవాలలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై డిసిపి భాస్కర్ తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మంచిర్యాల జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంగా కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరపడం చట్ట విరుద్ధమని తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత సమాజంలో అవగాహన పెంపొందించి బాల్య వివాహాలను అరికట్టేందుకు బాధ్యతగా వ్యవహరించాలని, బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఎసిపిలు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ సి ఏ ఆర్ క్రిడా ఆధ్వర్యంలో మేరగావ్ మేరా గౌరవ్ కార్యక్రమం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ఐ సి ఎ ఆర్ -క్రిడా ఆధ్వర్యంలో "మేరా గావ్ మేరా గౌరవ్" కార్యక్రమం కింద భూసార పరిరక్షణ మరియు సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం హైదరాబాద్‌లోని ఐసీఏఆర్--సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (ఐ సి ఎ ఆర్ -క్రిడా ) ఆధ్వర్యంలో "మేరా గావ్ మేరా గౌరవ్ (వీ+వీ+)" కార్యక్రమం కింద భూసార పరిరక్షణ మరియు సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం 25 మే 2026న తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సర్పంచ్ మనీషా బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (×జూా=), న్యూ ఢిల్లీ ప్రారంభించిన "సమతుల్య ఎరువుల వినియోగంపై ప్రత్యేక అవగాహన ప్రచారం"లో భాగంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం ప్రాముఖ్యత, మట్టి పరీక్షల ఆధారంగా పోషక నిర్వహణ, పంటల వైవిధ్యీకరణ, భూసార పరిరక్షణ, పంట అవశేషాల సమర్థ వినియోగం మరియు నీటి సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే, స్థిరమైన వ్యవసాయంలో బయోఫర్టిలైజర్ల పాత్రపై రైతులకు వివరించి, విత్తన శుద్ధి (ాववస ్తీమ్ఎవత్) పద్ధతులపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్-క్రిడాకు చెందిన క్రింది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు: డా. జి. ప్రతిభ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (అగ్రానమీ) డా. హెచ్.బి. సంతోష్, సీనియర్ సైంటిస్ట్ (ప్లాంట్ బ్రీడింగ్) డా. కె.బి. శ్రీధర్, సీనియర్ సైంటిస్ట్ (అగ్రోఫారెస్ట్రీ) అధికంగా యూరియా వినియోగం వల్ల భూసార నాణ్యత దెబ్బతినడం, పంట దిగుబడులు తగ్గడం, పోషక అసమతుల్యత ఏర్పడడం మరియు సాగు వ్యయాలు పెరగడం వంటి ప్రతికూల ప్రభావాల గురించి శాస్త్రవేత్తలు రైతులను అప్రమత్తం చేశారు. శాస్త్రవేత్తలు రైతులకు ఎక్స్-సిటు మరియు ఇన్-సిటు భూమిలోని తేమ సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎక్స్-సిటు తేమ సంరక్షణలో భాగంగా వర్షపు నీటి సంగ్రహణకు ఫార్మ్ పాండ్ల ప్రాముఖ్యత మరియు ఎండకాల విరామాల సమయంలో పంటలకు అనుబంధ సాగునీరు అందించడంలో వాటి పాత్రను రైతులకు వివరించారు.




# గణితశాస్త్రంలో కస్ప శ్రీలతకు పీహెచ్.డీ.

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కస్ప శ్రీలత డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలు అయస్కాంత-ద్రవగతి ప్రవాహ విశ్లేషణ' చేసి, ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి షేరి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ డాక్టరల్ పరిశోధన, శక్తి వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ శీతలీకరణ, పర్యావరణ నమూనా వంటి అధునాతన సాంకేతిక అనువర్తనాలలో ఉష్ణ, ద్రవ్యరాశి బదిలీ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెట్టినట్టు తెలియజేశారు.ఈ అధ్యయనం, నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలతో కూడిన సంక్లిష్ట నాన్-లీనియర్ ప్రవాహ వ్యవస్థలను విశ్లేషించడానికి గాలెర్కిన్ ఫైనైట్ ఎలిమెంట్ పద్ధతిని, మ్యాట్ లాబ్-ఆధారిత సిమ్యులేషన్లను ఉపయోగించిందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు ఉష్ణ-ద్రవ వ్యవస్థలు, గతిశాస్త్ర పరిశోధనల పురోగతికి గణనీయంగా దోహదపడతాయని వివరించారు.డాక్టర్ శ్రీలత సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955